క్లుప్తంగా

పిడుగురాళ్ల ఎంపీడీవోగా సుబ్బారావు



పిడుగురాళ్లరూరల్: పిడుగురాళ్ల మండల ఎంపీడీవోగా డి.సుబ్బారావు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఆయన కృష్ణాజిల్లా గుడూరు మండలం నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా వచ్చారు. ఎంపీడీవోగా పని చేస్తున్న కాశయ్య బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లారు. ఎంపీడీవో సుబ్బారావుకు ఎంపీపీ అల్లు సత్యవతిపిచ్చిరెడ్డి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయనకు అభినందనలు తెలిపారు.

దుర్గి ఎంపీడీవోగా చిన్నారావు బాధ్యతల స్వీకారం



దుర్గి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలువురు అధికారులను బదిలీ చేసిన విషయం విదితమే. శుక్రవారం దుర్గి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ చిన్నారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా, గోదావరి ప్రాజెక్టు ప్రోగ్రాం డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా దుర్గి ఎంపీడీవోగా నియమితులయ్యారు. గతంలో ఎంపీడీవోగా ఉన్న కె.సమతావాణి ప్రకాశం జిల్లా కొరిసపాడు మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీడీవోకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు ఆసరా చెక్కులు పంపిణీ

గురజాల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఆసరా చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మచలమయ్యలు తెలిపారు. మండల పరిధిలోని గంగవరం, పులిపాడు, దైద, తేలుకుట్ల, గొట్టిముక్కల, సమాధానంపేట, మాడుగుల గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఘనంగా వీడ్కోలు



కారెంపూడి: బదిలీపై వెళ్తున్న కారెంపూడి తహసీల్దార్ జి.శ్రీనివాస్‌యాదవ్‌ను మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. తహసీల్దార్ శ్రీనివాస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నూతన సర్వేను వేగవంతంగా నిర్వహించారని, ఎంతో సౌమ్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని నూతన ఎంపీపీ బొమ్మిన అల్లయ్యసావిత్రి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం పేర్కొన్నారు. డీటీ కీర్తి సుధా స్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మిరెడ్డి ఎర్ర గురవారెడ్డి, విశ్రాంత డీటీ యడ్ల రామకృష్ణారావు, పలు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాలు ఆయనను సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు



పిడుగురాళ్ల: స్థానిక తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మీ, ఆర్ఐ శ్రీనుబాబు, సీనియర్ అసిస్టెంట్, వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్, సబార్డినేటర్ ఓబులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీలో జాప్యం తగదు

క్రోసూరు: మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధికారులు శుక్రవారం పలు గ్రామాలు సందర్శించారు. 88త్యాళ్లూరు, అనంతవరం, దొడ్లేరు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అయుష్మాన్ భారత్ పథకాలు ఏ విధంగా అమలు జరుగుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జగనన్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. కార్డులు అందని వారికి త్వరగా అందజేయాలని వలంటీర్లను కోరారు. జగనన్న ఆరోగ్యశ్రీ కార్డులు అందని వారు ఎంపీడీవో కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

పల్లె సేవాలయాలు.. గ్రామ సచివాలయాలు

- పల్లె ముంగిటకే ప్రభుత్వ సేవలు
- సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల్లో ఆర్థిక భరోసా

గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందనేది నిజం చేస్తూ ఆ దిశగా ఆలోచన చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు శ్రీకారం చుట్టారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లారు. ఉన్న ఊళ్లోనే ప్రజలకు అన్ని సేవలు అందితే పల్లె ప్రజల వ్యయ ప్రయాసలు తగ్గుతాయి.



ఇంటి వద్దే వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భవాని



గ్రామ సచివాలయం

మాచర్ల రూరల్: పల్లె ముంగిటకే పాలన తేవాలి, పేదల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం కావాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. అన్ని సంక్షేమ పథకాలను, సేవలను ప్రజల దరిచేర్చారు. ఇంటి వద్దకే సేవలను అందించటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కులం, ఆదాయం, నివాసం వంటి ధ్రువపత్రాలు కావాలన్నా కి.మీల దూరంలో ఉన్న మండల కేంద్రాలకు రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. జగనన్న ఏర్పాటు చేసిన సచివాలయాల వలన ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది తప్పింది. లబ్ధిదారులకు సమయం, డబ్బు ఆదాతో పాటు నిర్ణీత సమయంలోనే ఇంటి వద్దకు వలంటీర్లు సంబంధిత సర్టిఫికెట్లు అందించటంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను గుర్తించిన సీఎం జగన్ పరిపాలన రంగంలో సరికొత్త విధానానికి తెరతీస్తూ ప్రతి 2వేల మందికి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా 1.50లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగులకు మంచి భవిష్యత్తును అందించారు. తమ గ్రామం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రజలు జే జేలు పలుకుతున్నారు.



సీఎం జగనన్న ఋణం తీర్చుకోలేనిది..



మారుమూల తండా గ్రామాలలో నివసించే మాకు మా గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయటం సంతోషకరం. ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా 20 కి.మీల దూరంలో ఉన్న మాచర్లకు వెళ్లాల్సిన పని తప్పింది. దరఖాస్తు చేసుకున్న కొద్ది రోజుల్లోనే సర్టిఫికెట్ ఇంటికి రావటం చరిత్రలో చూడలేదు. సీఎం జగనన్న ఋణం తీర్చుకోలేనిది.

– సభావత్ రవి నాయక్

జగనన్నకు మేం అండగా ఉంటాం..



గత ప్రభుత్వంలో ఆదాయ, కుల ధ్రువీకరణ, ఇతర పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాము. సమయం, డబ్బు వృథా తప్పితే సకాలంలో పనులు కాలేదు. జగనన్న ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో వలంటీరే మా ఇంటి వద్దకు వచ్చి సమస్యను తెలుసుకొని అన్ని రకాల ధ్రువపత్రాలు ఇచ్చి వెళ్తున్నాడు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పాయి. జగనన్నకు మేం అండగా నిలబడి ఆయన ఋణం తీర్చుకుంటాం.

– రమావత్ మాద్యానాయక్

గిరిజనులు, చెంచులకు ఆర్థిక చేయూత..



కొండ కోనల్లో, అడవి పట్టున నివసించే గిరిజన, చెంచుల గ్రామాల్లో సచివాలయాన్ని ఏర్పాటు చేయటం చరిత్రాత్మక నిర్ణయం. గత ప్రభుత్వాలలో ఏ పథకం పొందాలన్నా దూరంలోని పట్టణాలకు వెళ్లలేక పథకాలు పొందలేక చెంచులు దీన స్థితిలో ఉండేవారు. జగనన్న తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల వలన ప్రతి పథకం ఇంటి ముందుకే వచ్చింది. గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి సచివాలయ వ్యవస్థ దోహదం చేసింది. అట్టడుగు వర్గాల అభివృద్ధికి శ్రీకారం చుడుతున్న జగనన్నకు అండగా ఉంటాం.

– మండ్లి పెద మల్లుస్వామి , జెడ్పీటీసీ సభ్యులు

చరిత్రలో చెప్పుకునేలా పని చేశాం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : చరిత్రలో చెప్పుకునేలా సంక్షేమం, అభివృద్ధి చేశామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. సారంగపల్లి అగ్రహారం నుంచి చెన్నాయపాలెం వరకు రూ.9.30 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. తంగెడ, ముత్యాలంపాడు, కేసానుపల్లి, తక్కెళ్లపాడు, పెదగార్లపాడులో జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టే మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి తక్కెళ్లపాడులో 95మంది నిరుపేదలకు ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తాము చేసింది ఫలానా అని ప్రజలకు చెప్పుకోవటానికి ఒక్క పని కూడా లేదని, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల మొదలు ఎన్నో అభివృద్ధి పనులు చేసి ప్రజలకు అండగా ఉన్నామని, తాము చేసిన మంచి పనులు చరిత్రలో కూడా చెప్పుకుంటారని అన్నారు. అభివృద్ధి చేయాలనే తలంపుతో ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నామని, మరోసారి అధికారంలోకి వచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. పని చేస్తున్న ప్రభుత్వం ఏదో... పనిచేయకుండా మోసం చేసిన ప్రభుత్వం ఏదో ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీ కందుల జాను, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు చాట్ల కాశయ్య, నెమలికొండ వెంకటచారి, వినుకొండ కోటేశ్వరరావు, కర్పూరపు వెంకటకోటయ్య, ఎంపీటీసీలు జంగిలి నరసింహారావు, వెంకటనాగయ్య, నాయకులు గొగిరెడ్డి వెంకటరెడ్డి, కాసర్ల నరసింహారెడ్డి, టంటం శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్ తదితరులున్నారు.

వాటర్ ఎయిడ్ ఇండియా సేవలు ప్రశంసనీయం



రాయవరం ఎంపీపీ పాఠశాలలో హ్యాండ్ వాష్ బేసిన్‌లను ప్రారంభిస్తున్న ఎంఈవో అల్లి సురేష్

మాచర్ల రూరల్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాఠశాలలో వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ వారు హ్యాండ్ వాష్ బేసిన్‌లను ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎంఈవో అల్లి సురేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రాయవరం ఎంపీపీ పాఠశాలలో హ్యాండ్ వాష్ బేసిన్‌లను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, చేతుల శుభ్రత ద్వారా బ్యాక్టీరియాను నిర్మూలించి ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చన్నారు. వాటర్ ఎయిడ్ ఇండియా ల్యాబ్ కో ఆర్డినేటర్ గురుప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో భూగర్భ జలాలను పెంచేందుకు తమ సంస్థ పని చేస్తుందని, ఎస్సీ కాలనీలో తాగునీటి నివారణకు మంచినీటి ట్యాంకులను నిర్మించినట్లు చెప్పారు. అనంతరం ఇటీవల ఉత్తమ విద్యాశాఖాధికారిగా అవార్డు తీసుకున్న ఎంఈవో సురేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిలమకూరి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ మట్టా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పినపాటి సుందరలీల, మాజీ సర్పంచ్ ముత్తయ్య, హెచ్ఎం రత్నానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో కంది కొనుగోలు కేంద్రాలు

ముప్పాళ్ల: రైతు భరోసా కేంద్రాల్లో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. మండలంలోని మాదల, ముప్పాళ్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కంది పంటలో యాజమాన్య పద్ధతులు, కందుల సేకరణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో కంది పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రస్తుతం క్వింటాకు రూ.7వేలు మద్దతు ధర ప్రకటించిందని, అయినప్పటికీ మార్కెట్ ధరకు అనుగుణంగానే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని చెప్పారు. ముందుగా సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని వీఏఏ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి

విజయపురిసౌత్: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మాచర్ల మండలం పసువేముల సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతలతండాకు చెందిన రమావత్ బుజ్జిబాయి(42) తన కొడుకుతో కలసి ద్విచక్ర వాహనంపై మాచర్ల నుంచి చింతలతండాకు వస్తోంది. సరిగ్గా పసువేముల సమీపంలోకి రాగానే ఆమెకు బీపీ తగ్గి బైక్‌పై నుంచి కింద పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ కె.వెంకట కొండారెడ్డి తెలిపారు.



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కార్యవర్గం ఎన్నిక

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిందని కమిటీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుల్లా రాజారావు అధ్యక్షతన కార్యవర్గ ఎన్నిక జరిగినట్లు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గానికి రెండు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందని తెలిపారు. నూతన అధ్యక్షుడు గార్లపాటిదాసు మాట్లాడుతూ పల్నాడు జిల్లా కలెక్టర్ ఐడీ కార్డులు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా మిగతా జిల్లాల డీవీఎంసీ సభ్యులకు త్వరలో ఇస్తారని తెలిపారు. డీవీఎంసీ సభ్యులకు బస్‌పాస్‌లివ్వాలి, నిరుపేదలకు భూములు పంచాలన్నారు. ప్రభుత్వ భూముల అసెస్మెంట్ కమిటీలో డీవీఎంసీ సభ్యులకు ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు.

లేగదూడల పోషణలో మెళకువలు తప్పనిసరి

సత్తెనపల్లి: లేగ దూడల పోషణలో మెళకువలు తప్పనిసరిగా పాటించాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పి.రామారావు అన్నారు. కొమెరపూడి గ్రామంలోని పశు వైద్యశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి రైతులు లేగ దూడల పోషణలో మెలకువలను గ్రహించి పాటించాల న్నారు. సహాయ సంచాలకుడు డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పశువులకు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. సత్తెనపల్లి ఏడీ డాక్టర్ మంగు శ్రీనివాసరావు పశువుల్లో పిండ మార్పిడి పద్ధతిపై అవగాహన కలిగి ఉండాలని రైతులకు సూచించారు. ప్రదర్శనకు 45 లేగ దూడలను తీసుకురాగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మిగిలిన వారికి ప్రోత్సాహకాలు అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత పశు వైద్య శిబిరంలో 35 పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ శ్యామ్‌సన్, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి ఐబూన్‌బీ ఇస్మా, గ్రామ సర్పంచ్ కొరివి అనిల్‌కుమార్, పశువైద్యాధి కారులు, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

ప్రభుత్వ విప్ పీఆర్కే



సీసీ రోడ్డు భూమిపూజలో ప్రభుత్వ విప్ పీఆర్కే, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పీవీఆర్

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న సుపరిపాలనలో సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు అని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన రూ.20 లక్షల నిధులతో శుక్రవారం స్థానిక ఆనంద్‌పేట కాలనీలో ఆయన పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, నేతలతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందజేయడానికే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా 32 సంక్షేమ పథకాల ద్వారా పేదలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌నే ప్రజలు మళ్లీ 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రిని చేస్తారు గానీ అబద్ధాలు చెప్పే చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, పార్టీ నేతలు బి.సంపూర్ణమ్మ, పులి ఓబుల్‌రెడ్డి, గుజ్జుల సైదారెడ్డి, పేరం పెదసీతారామిరెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

కారెంపూడి ఎంపీపీగా సావిత్రి పదవీస్వీకారం



ప్రభుత్వ విప్ పీఆర్కేతో నూతన ఎంపీపీ సావిత్రి అల్లయ్య, ఎంపీటీసీలు

కారెంపూడి: కారెంపూడి ఎంపీపీగా బొమ్మిన సావిత్రిఅల్లయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నూతన ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన సావిత్రిఅల్లయ్యను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం పీఆర్కే సావిత్రిఅల్లయ్యను ఎంపీపీ సీటులో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఎన్నడూ లేని విధంగా కాపులకు పీఆర్కే తగిన ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే అడుగు జాడల్లో నడుస్తూ మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు నూతన ఎంపీపీకి అభినందనలు తెలిపారు. పీఆర్కేను నూతన ఎంపీపీ, ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, పార్టీ నాయకులు కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కుమార్ యాదవ్ నియామకం హర్షణీయం



సమావేశంలో పాల్గొన్న మండల బీసీ నాయకులు

మాచవరం: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయ కర్తగా మాజీ భారీ నీటిపారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించడం హర్షణీయమని జెడ్పీటీసీ జెవ్వనబోయిన శివాయాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం మండల కన్వీనర్ జంగాల సురేష్‌లు పేర్కొన్నారు. అనిల్‌కుమార్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల బీసీ నాయకులు శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ పార్టీ అధినేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని మొదటి సారి నరసరావుపేట ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించడం సంతోషకరమన్నారు. బీసీలంటే వెనుకబడిన తరగతులు కాదని, వెన్నెముకగా గుర్తించి, పార్టీలో అధిక ప్రాధాన్యత కల్పిస్తూ బీసీలకు ఉన్నత పదవులు ఇచ్చి ఆత్మ గౌరవాన్ని పెంచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీలంతా వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా ఉండి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చేనేత విభాగ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బారావు, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, యార్డు డైరెక్టర్ ఎం.రాము, మండల కో–ఆప్షన్‌మెంబర్ మహమ్మద్ జానీ, ఎంపీటీసీ సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ రాగిడి నరేష్, బీసీ మండల నాయకులు స్వామి నాగేశ్వరరావు, చిన ఆంజనేయులు, రత్తయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డు పేద ప్రజలకు వరం

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



లబ్ధిదారునికి ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డును అందజేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచుతూ అందజేస్తున్న ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డు ఒక వరమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో పాటు 1,059 రోగాల నుంచి 3,257 రకాల రోగాలకు విస్తరించడంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 608 మందికి ఈ కార్డులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో గుడిసెలను తొలగించిన అధికారులు



గుడిసెలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పిడుగురాళ్ల: పట్టణంలోని సుందరయ్య కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో అనధికారికంగా గుడిసెలు వేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ టీపీఎస్‌వో అనురాధ అనధికారికంగా గుడిసెలు వేసిన వారి వివరాలను సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికి ఇళ్ల పట్టాలు అందించి, ఇళ్లు నిర్మించి ఇస్తుంది. ఈ క్రమంలోనే ఇటీవలే సుందరయ్య కాలనీలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. అర్హత ఉన్న వారు ఇంకా ఎవరైనా ఉంటే వారు నేరుగా నమోదు చేసుకోవచ్చని, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని టీపీఎస్‌వో వివరించారు. ఇలా అనధికారికంగా గుడిసెలు వేయటం సరికాదని ఆమె అన్నారు. వెంటనే మున్సిపల్ కార్యాలయానికి చెందిన జేసీబీతో గుడిసెలను, డేరాలను తొలగింపజేశారు. అర్హత ఉన్న వారు ఎవరైనా ఉంటే ప్రభుత్వం పట్టాలిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని దుకాణాలు, వ్యాపారాలు ఈ నెల ఆఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కార్మిక శాఖ సహాయ అధికారి జి.నగరాజ తెలిపారు. పట్టణంలోని కార్మిక శాఖ చట్టం ప్రకారం ప్రతి షాపు వారి దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె తెలిపారు.